RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 283 పేజీలు - 08 సోమవారం 07 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## ఢిల్లీలో కూలిన భవనం.. ముగ్గురి మృతి

**ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఘోర ప్రమాదం**

**ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, పలువురిని కాపాడిన సహాయక బృందాలు**

**మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి**

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాలు ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్**

**శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అనుమానాలు**



**తొలి అక్షరం/ఢిల్లీ సెప్టెంబర్ 6:** దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో మరమ్మతు పనులు జరుపుకుంటున్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. **మిగతా 2లో...**

## ఇస్రో ప్రైవేటీకరణ అవాస్తవం

**ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ**

**మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ**

**అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో**

**ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి**




**తొలి అక్షరం/ఢిల్లీ సెప్టెంబర్ 6** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది **మిగతా 2లో....**

## సాత్విక్-చిరాగ్ సంచలనం..

చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం



**చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకున్న సాత్విక్-చిరాగ్**

**ఫైనల్‌లో చైనా జోడీపై హోరాహోరీ పోరులో విజయం**

**తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం**

**ఈ సీజన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్**

**గాయాలతో బాధపడుతున్నా అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత జోడీ**

**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 6:** భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్మాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ **మిగతా 2లో...**

# కొత్త పింఛన్లకు దరఖాస్తులు

**నేటి నుంచి 16 వరకు స్వీకరణ**

**ఎన్టీఆర్ భరోసాలో కొత్త అధ్యాయం**

**మరింత మందికి సామాజిక భద్రత**

**ఇప్పటికే 62 లక్షల మందికి భరోసా**

**కొత్త పింఛన్ల ప్రక్రియకు ప్రత్యేక ఏర్పాటు**

**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 6:** రాష్ట్రంలో కొత్త పింఛన్లకోసం ఎంతగానో ఎదురు చూస్తున్న పేదలకుప్రభుత్వం తీపి కబురు అందించింది. నేటి నుంచి ఈనెల 16వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. ఇప్పటికే సామాజిక భద్రత పింఛన్లతో 62 లక్షల మంది పేదలకు ప్రతినెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు,దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంకింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. **మిగతా 2లో...**



## మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు

మార్చి2029 నాటికి మత్తు చిత్తు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా

**తొలి అక్షరం/ఢిల్లీ సెప్టెంబర్ 6** కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం గోవాలోమీడియాతో మాట్లాడుతూ, 2029 నాటికి భారతదేశాన్నిపూర్తిగా మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందనితెలిపారు. మాదకద్రవ్యాలు లేని యువశక్తి 2047 నాటికివికసిత భారత్ను నడిపిస్తుందనేది ప్రధాని నరేంద్ర మోడీలక్ష్యమని పేర్కొన్నారు. నక్సలిజం, ఉగ్రవాదం వంటి ముప్పులను ఎలా **మిగతా 2లో...**



## ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్న కేసీఆర్

**తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి**

**: మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ డిమాండ్**

**బీఆర్ ఎస్ పదేండ్ల పాలన.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనపై చర్చకు సిద్ధమంటూ సవాల్**

**హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం,**






## 8 హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు..

**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 6:** దేశంలోని న్యాయవ్యవస్థలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల మేరకు ఎనిమిది హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను (సీజే) నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు **2లో...**



## అసెంబ్లీ సమావేశాల తర్వాత పాదయాత్ర

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం**

**కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు**

**సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి**

**అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం**

**ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్**


**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 6:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది.ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం **మిగతా 2లో...**

## ఉప్పాడ రక్షణ గోడ నిర్మాణానికి సర్వే పనులు ప్రారంభం

**డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం రంగంలోకి ఐఐటీ మద్రాస్ నిపుణులు**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో కదులుతున్న పనులు**

**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 6:** దశాబ్దాలుగా సముద్ర కోతతో విలవిలలాడుతున్న పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ తీరప్రాంత వాసుల చిరకాల స్వప్నం సాకారం దిశగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి. **మిగతా 2లో...**



## ఏపీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్.. పీవీ మోహన్‌కు బాధ్యతలు

**ప్రస్తుత ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్‌పై వేటు**

**ఏపీకి చెందిన సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్ బాధ్యతలు**

**పంజాబ్‌కు సచిన్ పైలట్, అస్సాంకు భూపేష్ భగేల్ ఇన్‌ఛార్జ్‌లు**

**నియామకాలను ప్రకటించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్**



**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 6:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పార్టీలో పలు కీలక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు **మిగతా 2లో...**

# అసెంబ్లీ సమావేశాల తర్వాత పాదయాత్ర

**మొదటిపేజీ తరువాయి**

వివరాలను అసెంబ్లీలో బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు."ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం" అని హరీశ్ రావు తెలిపారు.
అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను 'నిషేధిత జాబితా'లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్‌ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు.
అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే వీధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు.
ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్‌గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు.
కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. 'ఆరు గ్యారెంటీలు', రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

# ఇస్రో ప్రైవేటీకరణ అవాస్తవం

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది.ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది.
అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది.సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.
భవిష్యత్ లక్ష్యాలు ఇవే..
భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది.
ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

# ఢిల్లీలో కూలిన భవనం.. ముగ్గురి మృతి

**మొదటిపేజీ తరువాయి**

శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు.
సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు.
ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, "భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం" అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

# ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్న కేసీఆర్

**తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి**
**: మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ డిమాండ్**
**బీఆర్ ఎస్ పదేండ్ల పాలన.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనపై చర్చకు సిద్ధమంటూ సవాల్**
**హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అజారుద్దీన్,**
**పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు**



తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 6:

ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీకి రాని బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ఉ ఆ హోదాను అపహాస్యం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న ఆయన సభకు రాకపోవటం అత్యంత శోచనీయమని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ ఆయన కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఇదే అంశంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు సారధ్యంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ రెడ్డి, మాజీ ఎంపీలు మధుయాష్కీ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూఉ'పదేండ్ల పాలనలో బీఆర్ ఎస్ రాష్ట్రానికి ఏం ఒరగబెట్టిందో.. రెండున్నరేండ్లలో కాంగ్రెస్ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందో చర్చించేందుకు మేం సిద్ధం.. మీరు సిద్ధమాఉ?' అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు.బీఆర్ ఎస్ పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలుఉ గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్‌కు ప్రతిపక్ష బాధ్యత ఇచ్చారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానిది కీలక పాత్ర అని చెప్పారు. కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తే ఆయన అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తున్నారని ఎద్దేవా చేశారు. అందుకే ఎమ్మెల్యే పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో చెప్పాలని కేసీఆర్ ను నిలదీశారు. అధికారం ప్రజలిచ్చే కానుకని, వారి ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగానే తమ ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ప్రజలకిచ్చిన మాటకు కట్టుబడి అనేక హామీలను అమలు చేస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లిస్తామని చెప్పి ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు భిన్నంగా ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టించటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులకు చదువుతో పాటు సంస్కారం అవసరమని హితవు పలికారు. పదేండ్ల కాలంలో విదేశీ పెట్టుబడులు ఏ మేరకు తెచ్చారో చెప్పాలని నిలదీశారు.తాము రెండున్నరేండ్లలో రూ.లక్షా 78వేల కోట్లు విదేశీ పెట్టుబడులతోపాటు గ్లోబల్ సమ్మిట్‌తో రూ. ఐదు లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. 70వేలకు పైగా ఉద్యోగాలను ఇచ్చామని, ఇంకో రెండున్నరేండ్లలో మరిన్ని ఉద్యోగాలు ఇచ్చితీరుతామని హామీనిచ్చారు. ఉద్యమకారులు గద్దర్, అందెశ్రీని కేసీఆర్ విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తమ ప్రభుత్వం వారిని సముచితంగా గౌరవించిందని గుర్తు చేశారు. కుల సర్వేతో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని వివరించారు. బీజేపీ నేతలు తమ ప్రభుత్వం గురించి వ్యంగంగా మాట్లాడటం తప్ప వారు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. కేసీఆర్‌ను కొడుకు కేటీఆర్, అల్లుడు హరీష్ రావు అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారా? అని ఎద్దేవా చేశారు. ఒకవేళ అల్లుడు, కొడుక్కి అవకాశం ఇవ్వాలనుకుంటే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకోవాలని కేసీఆర్ కు సలహానిచ్చారు.గత బీఆర్ఎస్ పాలనలో ధనిక రాష్ట్రమైన తెలంగాణ అప్పులపాలైందని వాపోయారు. ఆ ప్రభుత్వం రూ. ఎనిమిదిన్నర లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిందని, ఈ క్రమంలో తాము ఓ వైపు కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో కేసీఆర్ వైద్య రంగాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. స్కిల్ యూనివర్శిటీతో యువతలో నైపుణ్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును తొక్కిపెట్టి ఆయా తరగతుల నోటికాడి కూడును లాక్కుం టోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మెడలు వంచైనా సరే బీసీల గణనను కులగణనలో చేర్పిస్తామని చెప్పారు.

## ఉప్పాడ రక్షణ గోడ నిర్మాణానికి సర్వే పనులు ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

ఈ ప్రాజెక్టు డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన కోసం ప్రతిష్ఠాత్మక ఐఐటీ-మద్రాస్ నిపుణుల బృందం రంగంలోకి దిగింది.
గత వారం రోజులుగా ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం ఉప్పాడ తీరంలో క్షేత్రస్థాయి సర్వేను ప్రారంభించింది. అత్యాధునిక డ్రోన్లు, బీచ్ ప్రొఫైలింగ్, ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్‌ఎస్ ఆర్‌టీకే వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తీరం వెంబడి సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. సముద్ర గర్భంలోనూ, తీరం పొడవునా భౌగోళిక పరిస్థితులు, అలల తీవ్రత, సముద్ర ప్రవాహాల దిశ, కోతకు గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తున్నారు. ఇందులో భాగంగా సముద్రపు లోతును కొలిచే బాతిమెట్రిక్ సర్వేతో పాటు, తీరంలోని ఇసుక, మట్టి నమూనాలను సేకరించి పరీక్షిస్తున్నారు.
గత 40 ఏళ్లుగా ఉప్పాడ తీరంలో సముద్ర కోత కారణంగా వందల ఎకరాల భూమి, కొన్ని గ్రామాలు సముద్రంలో కలిసిపోయాయి. ఎందరో మత్స్యకారులు, రైతులు సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నడుం బిగించిన పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.323 కోట్ల జాతీయ విపత్తు నిర్వహణ నిధిని సాధించారు.
ఈ ప్రాజెక్టు పనులను పవన్ కళ్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. డిజైన్, డీపీఆర్ రూపకల్పనతో పాటు సమాంతరంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలో పిఠాపురం పర్యటన సందర్భంగా ఐఐటీ నిపుణులతో సమావేశమై పనుల పురోగతిని సమీక్షించనున్నారు. ఈ సర్వే పూర్తయిన తర్వాత ఐఐటీ మద్రాస్ ఇచ్చే నివేదిక ఆధారంగా రక్షణ గోడ డిజైన్‌ను ఖరారు చేసి, నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

# సాత్విక్-చిరాగ్ సంచలనం..

**మొదటిపేజీ తరువాయి**

హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు.గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు.
నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.
ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.

## ఏపీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్.. పీవీ మోహన్‌కు బాధ్యతలు

**మొదటిపేజీ తరువాయి**

చెందిన ఎమ్మెల్సీ పీవీ మోహన్‌ను నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న తమిళనాడు ఎంపీ మాణికం ఠాగూర్‌ను తప్పించి, ఆయన స్థానంలో మోహన్‌కు బాధ్యతలు అప్పగించింది.
ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం రాత్రి ఈ నియామకాలకు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్న పీవీ మోహన్, గతంలో కేరళ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా పనిచేశారు. తాజా మార్పులతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు కూడా కొత్త ఇన్‌ఛార్జ్‌లను నియమించారు.ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ నేత సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అదేవిధంగా, రాజస్థాన్ సీనియర్ నేత సచిన్ పైలట్‌కు పంజాబ్ ఇన్‌ఛార్జ్‌గా, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్‌కు అస్సాం ఇన్‌ఛార్జ్‌గా, రాజ్యసభ సభ్యుడు రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాకు గుజరాత్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు కేటాయించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది.

# కొత్త పింఛన్లకు దరఖాస్తులు

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్తపింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ. 4,000 పింఛన్.. కొత్త అర్హులకు గొప్ప అవకాశంరాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 62 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన పింఛన్లను ప్రభుత్వం క్రమం తప్పకుండా అందిస్తోంది. అయితే, వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు పింఛను అందుకోలేకపోయిన పేదలకు, నూతనంగా అర్హత సాధించిన వారికి కూడా లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది.**నూతన పింఛన్ల ప్రక్రియ - పూర్తి షెడ్యూల్**సెప్టెంబర్ 7 16: నూతన పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ.సెప్టెంబర్ 17 21: జనరల్ వెరిఫికేషన్ (సాధారణ పరిశీలన).సెప్టెంబర్ 22 24: ఫిజికల్, శాఖాపరమైన ధ్రువీకరణ, అర్హతల నిర్ణయం.సెప్టెంబర్ 25 26: 'సెర్ప్' ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ.దరఖాస్తు కేంద్రాలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 'స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు' (గ్రామ/వార్డు సచివాలయ) కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారు.దరఖాస్తుదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గాను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల వద్ద ముందస్తుగా ప్రత్యేక కౌంటర్లు, సదుపాయాలు ఏర్పాటు చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు అవసరమైన పత్రాలతో సమీప సచివాలయానికి వెళ్లి తమ దరఖాస్తులను అందజేయాలని అధికారులు సూచించారు. అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరితగతిన నూతన పింఛన్లు మంజూరు చేయనున్నారు.

# 8 హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు..

**మొదటిపేజీ తరువాయి**

జారీ చేసింది. ఈ నియామకాల వివరాలను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కొలీజియం సిఫార్సు చేసిన కొద్ది రోజులకే కేంద్రం వేగంగా స్పందించి ఈ నియామక ప్రక్రియను పూర్తి చేయడం గమనార్హం.నియామకాల వివరాల్లోకి వెళితే.. ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వల్లూరి కామేశ్వరరావును పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అదేవిధంగా బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ రవీంద్ర వి. ఘుగే కలకత్తా హైకోర్టుకు నేతృత్వం వహించనున్నారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ అగర్వాల్‌ను రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠి బాంబే హైకోర్టు కొత్త సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్


**మొదటిపేజీ తరువాయి**

అరికట్టామో, అదే పద్ధతిలో మాదకద్ర వ్యాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతా మని ధీమా వ్యక్తం చేశారు. 2014కు ముందు మాదకద్రవ్యాలపైపోరాటం చిన్న చిన్న విభాగాల్లో, ఒంటరిగా సాగేదని, ఏజెన్సీలు చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవని అమిత్ షా గుర్తు చేశారు. డ్రగ్స్పై ఈ పోరాటాన్నిజాతీయ భద్రతా ప్రాధాన్యతగా మోడీ ప్రభుత్వంమార్చిందని చెప్పారు.నాలుగు స్థాయిల్లోనార్కో సమన్వయ కేంద్రాలు2019లో నాలుగు స్థాయిల నార్కో సమన్వయ కేంద్రంఏర్పాటు చేశారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోప్రత్యేక మాదకద్రవ్య నిరోధక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటుచేశారు. మాదకద్రవ్య నియంత్రణ బ్యూరోను పునర్వ్యవస్థీకరించి బలోపేతం చేశారు. నిదాన్ పోర్టల్ ద్వారా నేరస్తులజాతీయ డేటాబేస్ సృష్టించారు. 1933 మానస్ హెల్ప్ లైన్‌ప్రారంభించి బాధిత యువతకు పునరావాసం అందిస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు.కార్యాచరణ ప్రణాళిక నాలుగు స్తంభాలపై ఆధారపడిఉంది. మేధస్సు, కార్యాచరణ ఆధారిత అమలు, సింథటిక్‌మాదకద్రవ్యాలు, పూర్వగామి రసాయనాల నియంత్రణ,డిమాండ్ తగ్గింపు, హాని తగ్గింపు, సామర్థ్య నిర్మాణం, సమన్వయం. దిగువ నుంచి పైకి, పై నుంచి కిందికి దర్యాప్తు విధానం అవలంబిస్తున్నారని అమిత్ షా తెలిపారు. చిన్న ప్యాకెట్‌స్వాధీనం చేసుకున్నా మొత్తం నెట్వర్క్ న్ను వెలికితీస్తారు.సరిహద్దుల్లో పెద్ద సరుకు పట్టుకున్నా వినియోగదారువరకు జాడ వెతుకుతారని కేంద్ర మంత్రి చెప్పారు.

# ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనం

**- గుడెప్పాడ్‌లో రక్తదాన శిబిరం.. అమ్మవారి పటం బహుకరణ**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) సెప్టెంబర్ 6:** హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు గుడెప్పాడ్‌లో ఘనంగా నిర్వహించారు.ఇనగాల యువసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొజ్జ భాను ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి గుడెప్పాడ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు.అనంతరం ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, ఆయనకు అమ్మవారి పటం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్, నాయకులు కుక్కల జగపతి, మైదానం ప్రవీణ్, దాసరి నరేష్, చెక్క రంజిత్, కుక్కల వినయ్, కొమ్ముల వంశీ, యం.డి. యాఖుబ్, గునిగటి సునిల్, యన్.యస్.ఆర్. తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవంగర మండల పేద విద్యార్థి ప్రతిభ

- **కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు**

**- ఆర్థిక సహాయం కోసం తల్లి వేడుకోలు**



**తొలి అక్షరం/పెద్దవంగర సెప్టెంబర్ 6:** మండలంలోని వడ్డెకొతపెల్లి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి దంతలపల్లి గోపీచంద్ (20) పేదరికాన్ని జయించి వైద్య విద్యలో సీటు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు.గోపీచంద్ 10వ తరగతి హైదరాబాద్ గాంధీనగర్ లోని ప్రైవేట్ పాఠశాలలో 10/10 జి పి ఎ ఇంటర్మీడియట్ గౌలిదొడ్డి ప్రభుత్వ గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 980 మార్కులతో ఉత్తీర్ణుడై, నీట్ లో 1.25.000 ర్యాంక్ సాధించి కాకతీయ మెడికల్ కాలేజీ కె ఎం సి వరంగల్ లో ఎం బి బి ఎస్ సీటు పొందాడు.కుటుంబ నేపథ్యం గోపీచంద్ తండ్రి లేట్ ప్రవీణ్ కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించారు. తల్లి సైదా కూలి పని చేసుకుంటూ ఇద్దరు కొడుకులను కష్టపడి చదివిస్తోంది. కుటుంబానికి సొంత భూమి గానీ, ఆదాయ వనరు గానీ లేదు.ఎం బి బి ఎస్ ఫీజు, హాస్టల్, పుస్తకాల ఖర్చు దాదాపు లక్షల్లో ఉండటంతో తల్లి సైదా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ప్రతిభ ఉన్నా డబ్బు లేక చదువు ఆగిపోతుందేమోనని ఆవేదన చెందుతోంది.కాబట్టి దాతలు, దయగల హృదయులు గోపీచంద్ చదువుకు సహాయం చేయాలని తల్లి సైదా వేడుకుంటున్నారు.సహాయం చేయదలచిన వారు సంప్రదించవలసిన వివరాలుఖాతా పేరు:దంతలపల్లి గోపీచంద్ ఖాతా నంబర్: 44198526121 IFSC: SBIN0017761, బ్యాంక్: SBI PhonePe / GPay / UPI: 8309572416 గ్రామం: వడ్డెకొతపెల్లి, మండలం: పెద్దవంగర, జిల్లా: మహబూబాబాద్

# మిర్యాలగూడలో లిటిల్ కిడ్స్ వ్యాలీ స్కూల్‌లో ఘనంగా పేరెంట్ & టీచర్ మీటింగ్



**తొలి అక్షరం/మిర్యాలగూడ, సెప్టెంబర్ 6:** మిర్యాలగూడలోని ప్రముఖ విద్యా సంస్థ లిటిల్ కిడ్స్ వ్యాలీ స్కూల్ లో ఈ రోజు పేరెంట్ - టీచర్ సమావేశం ఘనంగా జరిగింది.ఈ సమావేశంలో పాఠశాల డైరెక్టర్లు రవీందర్, జై రాజన్, రవి కుమార్, ప్రసాద్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ... ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న స్కూల్ మన మిర్యాలగూడలో ఎక్కడా లేదని, పిల్లలకు అందిస్తున్న క్రమశిక్షణ, చదువు చాలా బాగుందని కొనియాడారు. పాఠశాల యాజమాన్యం పిల్లల భవిష్యత్తు కోసం తీసుకుంటున్న చర్యల పట్ల హర్షం వ్యక్తం చేశారు.పిల్లల చదువు, వారి ప్రవర్తన, భవిష్యత్ ప్రణాళికల గురించి ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చించారు.

# చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం



**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 6:** మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తొమ్మిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు.యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ వడ్డేపల్లి నరసింహ, చౌటుప్పల్ డివిజన్ చైర్మన్ వడ్డేపల్లి శ్రీనివాస్, చౌటుప్పల్ డివిజన్ నాయకులు గడ్డం జలంధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణతో పాటు సమాజ సేవకు తమ సంస్థ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఆత్మీయతను పంచుతూ, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.సమాజంలో సేవా భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ వైష్ణవి, ఆసుపత్రి సిబ్బంది, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


# తాగి నడిపితే.. అంతే సంగతులు

**- మల్కాజిగిరిలో ముమ్మర తనిఖీలు**

**- 248 మందిపై కేసులు**

**- మరణాలకు కారణమైతే బిఎన్ఎస్ 105 కింద కఠిన చర్యలు**

**- మల్కాజిగిరి ట్రాఫిక్-1 డీసీపీ రాహుల్ రెడ్డి, ఐపిఎస్**


MALKAJGIRI COMMISSIONERATE

TRAFFIC POLICE

TELANGANA STATE POLICE — Duty Honor Compassion

SAFE ROADS SAFER LIVES

PRESS NOTE

Malkajgiri Commissionerate Traffic Police have conducted a special drunk driving enforcement drive over the weekend (30.08.2026 – 05.09.2026), resulting in the apprehension of (248) offenders.

| THE VEHICLE-WISE BREAKDOWN OF THE CASES IS AS FOLLOWS: | |
|---|---|
| Two wheelers: | 210 |
| Three wheelers: | 14 |
| Four wheelers: | 24 |
| Heavy Wheelers: | 00 |

| THE GENDER-WISE BREAKDOWN OF THE CASES IS AS FOLLOWS: | |
|---|---|
| Male: | 248 |
| Female: | 0 |

OFFENDERS WERE CATEGORIZED BASED ON THEIR BLOOD ALCOHOL CONCENTRATION (BAC) LEVELS:

- 227 offenders had BAC levels ranging from 36 mg/100 ml to 200 mg/100 ml.
- 13 offenders had BAC levels ranging from 201 mg/100 ml to 300 mg/100 ml.
- 08 offenders had BAC levels above 300 mg/100 ml.

All the offenders will be produced before the Hon'ble Court.
Malkajgiri Commissionerate Traffic Police reiterate that driving under the influence of alcohol is a serious offence. If anyone is found to be driving in an inebriated condition and causes a fatal accident, such individuals will be booked under Section 105 of the Bharatiya Nyaya Sanhita, 2023 (Culpable Homicide Not Amounting to Murder). The mounum punishment under this section is 10 years of imprisonment along with a fine.

IN THE LAST WEEK (30.08.2026 TO 05.09.2026)

Total (205) DD cases were disposed in the Hon'ble courts, in which

- (00) respondent was given Fine and Jail.
- (11) respondents were given Fine and social service.
- (194) Respondents were imposed with a fine only.

DON'T DRINK & DRIVE YOUR FAMILY IS WAITING | DON'T DRINK & DRIVE | WEAR HELMET | OBEY TRAFFIC RULES | DON'T USE MOBILE WHILE DRIVING | WEAR SEAT BELT

@mkjtraffic | Malkajgiri Traffic Police | MKJTRAFFIC | TRAFFIC HELPLINE 8712662999 | Drive Safe Stay Safe

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్6:** మద్యం మత్తులో వాహనం నడిపారో..జైలు పాలవ్వడం ఖాయం అని మల్కాజిగిరి కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.గత వారం రోజులుగా (ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 5 వరకు) నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 248 మంది మందుబాబులు చిక్కారు.పట్టుబడిన వారం దరినీ న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు ట్రాఫిక్-1 డీసీపీ రాహుల్ రెడ్డి,ఐపిఎస్ వెల్లడించారు. ద్విచక్ర వాహనాలు 210, కార్లు/నాలుగు చక్రాల వాహనాలు 24, ఆటోలు 14 (పట్టుబడిన 248 మంది పురుషులే కావటం గమనార్హం). రక్తంలో ఆల్కహాల్ మోతాదు: 36 200 ఎంజీ 227 మంది 201 300 ఎంజీ: 13 మంది 300 ఎంజీ పైన: 08 మంది **ప్రమాదాల్లో ప్రాణాలు తీస్తే బిఎన్ఎస్ 105 నమోదు** మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదకర రీతిలో ప్రాణాలు తీస్తే నూతన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)-2023లోని సెక్షన్ 105 (హత్య నేరం కాని ప్రాణనష్టం) కింద కేసు నమోదు చేస్తామని డీసీపీ తెలిపారు. ఈ నేరానికి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. **205 కేసుల పరిష్కారం:** గత వారంలో కోర్టులో హాజరు పరిచిన కేసుల్లో 205 కేసులు పరిష్కారమయ్యాయి. విచారణ అనంతరం 194 మందికి జరిమానా విధించగా, 11 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవ చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు.

# అక్షర శిల్పులకు అపూర్వ గౌరవం

**- భావి భారత పౌరులను తీర్చిదిద్దడమే గురువుల లక్ష్యం**

**- పుడమి హైస్కూల్ ప్రిన్సిపాల్ పద్మిని**

**- పుడమి హైస్కూల్‌లో అంగరంగ వైభవంగా గురుపూజోత్సవం**




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్6:** గురువు అక్షరాల నిచ్చెన వేసి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చే అద్భుత శిల్పి.ఆ అక్షర శిల్పుల త్యాగాన్ని, శ్రమను స్మరించుకుంటూ బోడుప్పల్ శ్రీనివాస కాలనీలోని పుడమి హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మిని నాయకత్వం వహించారు.ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనం చేయడంతో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మిని మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఒక్క ఉపాధ్యాయుడేనని కొనియాడారు.సమాజంలో ఎంతటి ఉన్నత స్థాయికి ఎదిగినా ఓనమాలు నేర్పిన గురువును, జ్ఞానాన్ని ఇచ్చిన బడిని ఎప్పటికీ మరవకూడదు అని అన్నారు.తమ విద్యార్థుల విజయంలోనే తమ స్వంత విజయాన్ని చూసుకునే అమూల్యమైన,నిర్మలమైన మనసు ఉపాధ్యాయులది అని భావోద్వేగంగా పేర్కొన్నారు. **మెరిసిన చిరునవ్వులు ప్రత్యేక బహుమతులతో సన్మానం:** ఈ వేడుకల్లో అత్యంత ప్రధాన ఘట్టంగా ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిలిచింది. గురువుల పట్ల తమకున్న అపారమైన గౌరవాన్ని చాటుకుంటూ పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ పద్మిని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులందరినీ వేదికపైకి ఆహ్వానించి ప్రత్యేక బహుమతులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఊహించని ఈ ఆత్మీయ గౌరవానికి ఉపాధ్యాయుల ముఖాల్లో ఆనంద నిలయాలు వెల్లివిరిశాయి. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఉపాధ్యాయులపై వారు వ్యక్తపరిచిన అభిమాన ప్రసంగాలు సభకు విచ్చేసిన వారందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ మహోత్సవంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# గాన ప్రభంజనం.. ఇనుగుర్తి మురళి!

**తెలంగాణ మట్టి వాసనను.. ప్రజల గోసను గళమెత్తి వినిపిస్తున్న గాయక రత్నం!**

**సాక్షి టీవీ వేదికగా మరోసారి సత్తా చాటిన ఇనుగుర్తి మురళి..**

**మారుమోగుతున్న పల్లె పాట!**

**ఉద్యమ గీతాల నుంచి జానపదాల వరకు.. తన అద్భుత గాత్రంతో మైమరిపిస్తున్న కళాకారుడు!**




**తొలి అక్షరం/ఇనుగుర్తి సెప్టెంబర్ 6:** ఇనుగుర్తి: తెలంగాణ మట్టికి పాట కొత్త కాదు.. ఆ మట్టిలో పుట్టిన ప్రతి మనిషి గొంతులోనూ పల్లె పదాల జీవం ఉంటుంది. సరిగ్గా అదే తెలంగాణ యాసను, మాండలికాన్ని, సామాన్య ప్రజల జీవన గోసను తన గొంతుకగా మలుచుకుని, పాటలతో కోట్లాది మంది గుండెలను తాకుతున్న గాయకుడు.. ఇనుగుర్తి మురళి! తన ఊరి పేరునే తన గుర్తింపుగా మార్చుకుని, ఇనుగుర్తి ఖ్యాతిని రాష్ట్రవ్యాప్తంగా నలుమూలలా మారుమోగిస్తున్న ఈ ప్రజా గాయకుడు.. తాజాగా సాక్షి టీవీ ప్రత్యేక వేదికపై తన గాత్రంతో మరోసారి ప్రత్యేక ముద్ర వేశారు.మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ప్రజల్లో సమర శంఖం పూరించిన మురళి.. ఎందరో ప్రముఖ ఉద్యమకారులు, సీనియర్ గాయకులతో కలిసి ఉద్యమ వేదికలను వేడెక్కించారు. కేవలం ఉద్యమ గీతాలే కాకుండా పండగలు, పబ్బాలు, పల్లె జీవన వ్యథలను ప్రతిబింబించే పాటలతో ప్రతి ఇంట్లో ఒకడిగా మారిపోయారు. పలు టీవీ ఛానళ్ల ప్రత్యేక ప్రోగ్రామ్‌లు, యూట్యూబ్ లైవ్ ప్రదర్శనల ద్వారా లక్షలాది మంది అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.ఇటీవల సాక్షి టీవీలో ప్రసారమైన కార్యక్రమంలో ఆయన పాడిన పాటలు తెలంగాణ మట్టి పరిమళాన్ని మరోసారి ఆవిష్కరించాయి.

ఈ సందర్భంగా ఇనుగుర్తి మురళి భావోద్వేగంతో మాట్లాడుతూ "నేను పుట్టిన ఇనుగుర్తి నేలంటే నాకు ప్రాణం. నా గొంతు ఉన్నంతవరకు నా ఊరి పేరును, నా తెలంగాణ ప్రజల ఆనందాలను, కష్టాలను పాటల రూపంలో వినిపిస్తూనే ఉంటాను. నాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడుతున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.తన గాన ప్రయాణంలో నిరంతరం వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న డైరెక్టర్ రాజు కుమార్ సార్, భూపతి అన్న, యాంకర్ వెన్నెల, డప్పు నరేష్‌లకు మురళి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే తనలోని ప్రతిభను గుర్తించి ఇంత గొప్ప వేదికను కల్పించిన సాక్షి టీవీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ మట్టి పాటను మరింత ఎత్తుకు తీసుకు వెళ్లడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు.నుగుర్తి మురళి అంటే కేవలం ఒక గాయకుడు మాత్రమే కాదు.. తెలంగాణ సంస్కృతికి, పల్లె జనుల స్వరానికి నిలువెత్తు రూపం. తన పాటల జల్లులతో ప్రజాదరణ పొందుతున్న మురళి గాన ప్రస్థానం మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయన గొంతు నిరంతరం మారుమోగాలని కళాభిమానులు, ఇనుగుర్తి ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# చిన్న కొండూరులో ఘనంగా బోనాల పండుగ వేడుకలు

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు ప్రత్యేక పూజలు, ఉత్సవాలతో మార్మోగిన గ్రామం**





**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 6:** చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామంలో బోనాల పండుగ వేడుకలను గ్రామ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలోని అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, నెత్తిన బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. బోనాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాలతో గ్రామం సందడిగా మారింది. చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తి భావాలను ప్రతిబింబించేలా బోనాల వేడుకలు ఎంతో వైభవంగా సాగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతి నిధులు, యువజన సంఘాల నాయకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

స్వేచ్ఛ బంధి ఐంది
తప్పును తప్పనే స్వేచ్ఛలేదు
దోషిని దోషి అనే హక్కులేదు
ఇది స్వతంత్రమా లేక పరతంత్రమా !
పత్రికలు
అధికార ఆధీనతలొ మగ్గుతున్నాయి
ప్రసారమాధ్యమాలు
ఆశ్రీతత్వంలో ఆడుతున్నాయి
అంతా డబ్బుకు దాసోహమే అంటున్నాయి
జర్నలిజం చేసి
జనహితం మరిచి
సమాజానికి ఇస్తున్న
సమాచారం ఏంటి ?
ఓనర్లకు బంధి ఐంద్రు
సొంత ఆలోచనలు పక్కన పెట్టింద్రు
అందరు కాదండోయ్ కొందరు మాత్రమే
కలాన్ని కాసులకు జులిపిస్తుంద్రు
కాలం వెల్లబుచ్చుతుంద్రు
గళాన్ని గలగలలాడే
గల్లపెట్టెను చేస్తుంద్రు
యజమానులకు జమకూరుస్తుంద్రు
కానీ ....!
రాజ్యాంగ వ్యవస్థ నిర్వీర్యం అవుతుంటే
కంచే చేను మేస్తుంటే
అవినీతిని వెలికి తీసి
ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన పత్రికలు
వారికి పుత్రికలై పట్టించు కోకుంటే
మీడియా అంటి ముట్టనట్టు ఉంటే
సభ్యసమాజానికి మీరు
ప్రశ్నార్థకంగ మిగులుతుంద్రు
జర్నలిస్టులు
జనహితుల జన అహితుల అని
సంపాదకీయం సహితం
సంపాదనకే మరిగింది
పేపర్ చదవాలన్నా
టివిలో వార్తలు చూడాలన్నా
అసహ్యం వేస్తుంది
దోషిని నిర్దోషి అంటుంద్రు
నిర్దిషిని దోషి అంటుంద్రు
సామాన్యుడి సంగతి మరిచి
సామంతుల పంచన చేరి
బాధితుల పక్షం వదిలి
బాధ్యుల పక్షం వహిస్తూ
బుకాయిస్తూ దబాయిస్తున్నాయి
అందుకే
న్యాయం నాలుగు గోడల మధ్య
ఎదురు చూస్తూ ఉంది
నాకు స్వేచ్ఛ ఎప్పుడు వస్తుందా అని

– మీ రఘు బూర



# ఖబడ్దార్ గాదరి కిషోర్ మా ఎమ్మెల్యేను అనే స్థాయి నీకు లేదు

**కేటీఆర్,గాదరి కిషోర్, గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి హద్దుమీరి. మాట్లాడితే ఊరుకునేది లేదు**

**మీకు రాజకీయ సమాధి తప్పదు - తలకొప్పుల సైదులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు**




**తొలి అక్షరం/మిర్యాలగూడ సెప్టెంబర్ 6:** గత పది ఏళ్లు అధికారం అనుభవించి దోచుకొని దాచుకోవటానికి అలవాటు పడిన గాదర్ కిషోర్ అధికారం పోయేసరికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పైన మా శాసనసభ్యుల పైన నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నావ్, ఇలాంటి తింగర మాటలు మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాలుక కోస్తారని మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తెలంగాణ ప్రజలకు అనేకమైన హామీలు ఇచ్చి ఒక హామీ కూడా నెరవేర్చకుండా పదేళు రాష్ట్రాన్ని అప్పులకుప్పా చేస్తే కెసిఆర్ కి భజన చేసుకుంటూ వారి కాళ్ల దగ్గర పడుకున్నావు. దళిత ముఖ్యమంత్రి అని చెప్పి చేయకుండా ఉంటే అప్పుడు ఎందుకు మాట్లాడలేదు రా సన్యాసి కిషోర్ అని అన్నారు., కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రి తో పాటు నలుగురు దళిత ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది. కెసిఆర్ ప్రభుత్వంలో దళితులకు మంత్రి పదవి ఇవ్వకపోతే ఎందుకు అడగలేదు రా గాడిద కిషోర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తుంటే కళ్ళు కనిపించడం లేదని తెలిపారు. దళితులకు మూడు ఎకరాలు ఏమైందిరా అని అడిగారు. డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తానని చెప్పి కేసీఆర్ ఒక్కడే ఫామ్ హౌస్ కట్టుకొని పడుకుంటే ఎందుకు మాట్లాడలేదు అని తెలిపారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల తోటి గ్రామాలు కలకలలాడుతుంటే చూసి ఓర్వలేక నోటికొచ్చినట్టు ఈ కేటీఆర్,గాదరి కిషోర్, గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి హద్దుమీరి. మాట్లాడితే మా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల చేతిలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి వస్తుందని,రాబోయే రోజుల్లో మీకు రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాకునురి బసవయ్య గౌడ్, బుచ్చి రెడ్డి , యువజన కాంగ్రెస్ నాయకులు దైద సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుని తల్లికి మండల అధ్యక్షుడి సమ్మి గౌడ్ నివాళి

- **వీరాస్వామి తల్లి బక్కమ్మ మృతిపై సమ్మిగౌడ్ సంతాపం**
- **బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబర్ 6:** కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తిరుగుడు వీరాస్వామి, కానిస్టేబుల్ శ్రీనివాస్‌ల తల్లి బక్కమ్మ అనారోగ్యంతో మృతి చెందడం తీవ్ర విచారకరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్ అన్నారు. విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం ఉప్పరపల్లిలోని బక్కమ్మ నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిగౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రతి నాయకుడు, కార్యకర్తకు కష్టసుఖాల్లో అండగా ఉంటుందని అన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారు దయాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నూకల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు కంచ రాజు, పలస పద్మా వెంకన్న, తండా సంపత్, యువజన నాయకులు తండా శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరిగే విజేందర్, పబ్బతి సారంగం, అడప రమేష్, ఏటూరోజు పరిపూర్ణచారి, పబ్బతి శ్రీనివాస్, పలస నాగేష్, బట్టు మురళి, కంకల కొమురయ్య, ఆవుల బాబు, కంచ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# వంతెన మంజూరైనా.. వాగు కష్టాలు తీరేదెప్పుడు?

**ఆరికాయలపాడుజన్నారం మధ్య వాగుతో రైతులు, వాహనదారుల అవస్థలు**

**మంజూరు మాటలకే పరిమితం.. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారోనని స్థానికుల ఆందోళన**





**తొలి అక్షరం/ఏన్కూర్ ,సెప్టెంబర్ 6:** వంతెన మంజూరైందన్న ప్రకటనలు వెలువడుతున్నా.. క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ముందుకు సాగకపోవడంతో ఆరికాయలపాడుజన్నారం గ్రామాల మధ్య వాగు దాటే ప్రజల కష్టాలు కొనసాగుతున్నాయి. వాగుపై శాశ్వత వంతెన లేకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లడం నుంచి పండించిన పంటలను మార్కెట్‌కు తరలించే వరకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. వాహనాలు వాగు దాటే సమయంలో ప్రమాదాల భయం వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వాగులో నీటి ప్రవాహం పెరిగితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రులకు తరలించేందుకు కూడా ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా, వంతెన మంజూరైందని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాగు వద్ద నెలకొన్న వాస్తవ పరిస్థితులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్మాణానికి సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించాలని వారు కోరుతున్నారు. మంజూరు అయిందని చెప్పడమే కాదు.. వంతెన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత ఇవ్వాలి' అని రైతులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి తమ రాకపోకల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# పేదల ఆరోగ్య భరోసాకే ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత.

**- సూరిపల్లి సొసైటీ చైర్మన్ మాదటి శ్రీనివాస్.**

**వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని సూరిపల్లిలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 6:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం ముందడుగు వేస్తోందని, నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం తగ్గించి వారికి అండగా నిలవడమే ముఖ్య ఉద్దేశమని నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ మాదటి శ్రీనివాస్ పేర్కొన్నారు. నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఆయన లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు గౌరవపూర్వకంగా అందజేశారు. గ్రామానికి చెందిన బొల్ల సాత్వికకు 1,28,000 (ఒక లక్షా ఇరవై ఎనిమిది వేల రూపాయలు), అలాగే గూడ శివకుమార్‌కు 39,000 (ముప్పై తొమ్మిది వేల రూపాయలు) విలువైన సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాదటి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి పాలనలో, నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి విశేష కృషితో నియోజకవర్గంలోని పేదలకు సీఎం సహాయనిధి ద్వారా వేగవంతమైన వైద్య సాయం అందుతోందని తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ఎమ్మెల్యే ఎల్లప్పుడూ వెన్నంటే ఉండి భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. తమ కష్టకాలంలో ఆర్థిక సాయం అందించి ఆదుకున్నందుకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఎమ్మెల్యే శ్రీ దొంతి మాధవరెడ్డిఎకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తకొండ రాజు, సొసైటీ డైరెక్టర్లు కోటగిరి సాంబయ్య, పిట్టల కొమ్మాలు, పోగుల శ్రీనివాస్, మంకాళి ఐలయ్య, కన్నె సోమయ్య, నానబోయిన వెంకటేష్, పూజారి కోటయ్య, బొల్ల రమేష్, పిట్టల సాంబయ్య, శీలం శ్రీను, పోశాల సుధాకర్, చీకటి మధు, ఇర్ల వెంకట్, గడ్డం సంతోష్, రాచకొండ వెంకన్న, విరాగోని శ్రవణ్, దొమ్మ అశోక్ లతో పాటు గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిదానపల్లిలో ఘనంగా బోనాల వేడుకలు



**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 6:** రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామంలో ఆషాఢ బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ముత్యాలమ్మ తల్లికి గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. గ్రామపంచాయతీ నుంచి సర్కారు బోనాన్ని కోట మైసమ్మ తల్లికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళల బోనాల ఊరేగింపు, డప్పుల మోత, యువత నృత్యాలతో గ్రామం సందడిగా మారింది.



## అన్నారంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేత దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 6:** నకిరేకల్ కట్టంగూర్ మండలం అన్నారం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ, మారెమ్మ తల్లుల ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొన్నారు. ఆయనతో పాటు అన్నారం గ్రామ సర్పంచ్ చిలుముల సైదులు, సామ సుధాకర్ రెడ్డి, పెసర శ్రీనివాస్ రెడ్డి, నర్సిరెడ్డి, కక్కిరేణి సైదులు, మందడి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దంతాలపల్లిలో బీఆర్ఎస్ అధ్వరంలో ధర్నా



**తొలి అక్షరం/దంతాలపల్లి సెప్టెంబర్ 6:** దంతాలపల్లి లో బీ ఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 పూర్తయిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని డోర్నకల్ రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల బీ ఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఇంద్రపాలనగరం బోనాల్లో పాల్గొన్న ఎస్సైకి ఘన సన్మానం



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 6:** ఇంద్రపాలనగరం గ్రామంలో శ్రీ ఇంద్రపాల మారెమ్మ తల్లి, పాపమ్మ తల్లి బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రామన్నపేట ఎస్ఐ గోపతి సతీష్ ని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జాక్ రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ గర్ధాస్ విక్రమ్, ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి శాలువాతో ఘనంగా సన్మానించారు.

## భోగారంలో ఘనంగా ముత్యాలమ్మ బోనాల జాతర



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 6:** భోగారం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, పాలకవర్గం, మాజీ సర్పంచ్ అంతటి పద్మ రమేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్ యాదవ్, గ్రామ పెద్దలు, వివిధ కుల సంఘాల నాయకులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నీర్నంల గ్రామంలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 6:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధాంతి బ్రహ్మశ్రీ సత్యనారాయణ శాస్త్రి గ్రామ ఉపసర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్ ఆర్.సి.ఐ నోముల నరసయ్యగ్రామ పెద్దలు ఆవుల సత్యనారాయణ రామ్ శివకుమార్ బోయిని ఆనంద్ ఆవుల నరసింహ నోముల చిరంజీవి ఆలకుంట్ల రాజు నాగటి ఉపేందర్ చల్లా సత్య ప్రకాష్ నోముల రామలింగం వార్డు సభ్యులు మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్పంచ్ సతీమణి మృతికి ప్రభుత్వ విప్ వేముల వీరేశం నివాళి



**తొలి అక్షరం/రామన్నపేట:సెప్టెంబర్ 6:** రామన్నపేట మండలం నీర్నేముల గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి సతీమణి కందిమల్ల ప్రేమలత అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్మోహన్, సింగల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్, మాజీ ఎంపీటీసీ మహమ్మద్ రెహాన్, మహమ్మద్ అక్రమ్, నరసింహ, ప్రవీణ్ కుమార్, సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## శిరీష కుటుంబానికి ఎంపీ బోడే నగేష్ పరామర్శ

- బీజేపీ ఆధ్వర్యంలో ఘన సన్మానం..

కొమురం భీం, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు



**తొలి అక్షరం /ఏన్కూర్ సెప్టెంబర్ 6:** ఇటీవల అత్యాచారానికి గురై హత్యకు గురైన ములకలపల్లి మండలానికి చెందిన నర్సింగ్ విద్యార్థిని శిరీష కుటుంబాన్ని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ బోడే నగేష్ పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పి, ఘటనపై సానుభూతి వ్యక్తం చేశారు. శిరీష కుటుంబాన్ని పరామర్శించి తిరిగి వస్తున్న ఎంపీ బోడే నగేష్‌ను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి తమ అభినందనలు తెలిపారు. అనంతరం కొమురం భీం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ఎంపీ బోడే నగేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలు, సామాజిక న్యాయం కోసం వారు చేసిన పోరాటాలను నాయకులు స్మరించుకున్నారు. శిరీష ఘటనపై బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని నాయకులు కోరారు. మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రభుత్వం మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు వాసం శ్రీకాంత్, బీజేపీ నాయకులు మారబోయిన కృష్ణ, వజినేపల్లి ధరగయ్య, పాపారావు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**తొలి అక్షరం/షాద్‌నగర్, సెప్టెంబర్ 06:** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. రేషన్ కార్డు కోసం ఏ పార్టీ నాయకుడి సిఫారసు అవసరం లేదని, అర్హులు మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి కార్డులు మంజూరు చేస్తారని చెప్పారు. ప్రజలు దళారులను ఆశ్రయించవద్దన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన

**పల్లె ప్రగతికి బ్రేక్.. కాంగ్రెస్ పాలనపై అంజయ్య యాదవ్ ఫైర్**

**హామీలు బాకీ.. పల్లెలు అధ్వానం: నందిగామలో బీఆర్ఎస్ ఆందోళన**



**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 06:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా నందిగామలో బీఆర్ఎస్ 'కాంగ్రెస్ బాకీ కార్డుల' కార్యక్రమం నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఇంటింటికీ తిరిగి బాకీ కార్డులను పంపిణీ చేశారు. అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు కూడా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో అనేకం ఇంకా అమలు కాలేదని విమర్శించారు. గ్రామంలోని పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, చెత్త సేకరణ, డ్రైనేజీ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 'పల్లె ప్రగతి'తో గ్రామాల్లో పారిశుద్ధ్యం, హరితహారం, మౌలిక వసతులు అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకే ఈ కార్యక్రమమని తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కార్యక్రమాన్ని విస్తరిస్తామని అంజయ్య యాదవ్ వెల్లడించారు.

## విద్యారంగంలో విశిష్ట సేవలకు డా. పానకంటి భాస్కర్ రావుకు "శిక్షా రత్న అవార్డు-2026"



**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 6:** విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న రామన్నపేట శ్రీ హిందూ జూనియర్ & డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ & కరస్పాండెంట్ లిడా. పానకంటి భాస్కర్ రావు కి ప్రతిష్టాత్మక లి"హరి యూనివర్సిటీ బెస్ట్ టీచర్ - శిక్షా రత్న అవార్డు-2026" లభించింది. హైదరాబాద్ లోని కాన్హా శాంతి వనంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. మల్లిరెడ్డి నర్సిరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ వేడుకకు చీఫ్ గెస్ట్ గా తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకిష్టా రెడ్డి హాజరయ్యారు. డా. భాస్కర్ రావు విద్యారంగంలో అందిస్తున్న సేవలను, విద్యార్థుల భవిష్యత్తుకు చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం డా. భాస్కర్ రావు మాట్లాడుతూ "ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు మరింత కృషి చేస్తాను" అని అన్నారు. ఆయన తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ & పీజీ మేనేజ్మెంట్ అసోసియేషన్ మెంబర్ గా కూడా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశాన్ని ప్రారంభించిన నెక్కొండ మండల అధ్యక్షులు లౌడియా తిరుమల్ చౌహాన్



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 6:** వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీ 20వ డివిజన్‌కు చెందిన కొండోజు గీతా చరణ్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమాలో నెక్కొండ మండల అధ్యక్షులు లౌడియా తిరుమల్ చౌహాన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్లవాడ సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సూరుపల్లి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్, ప్రారంభించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమనిలి అన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామాలు మరియు పట్టణాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు మరియు పలువురు స్థానికులు పాల్గొన్నరు.

## సారీ ఫంక్షన్‌లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 6:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో భూమినిరమా మాధవరావు ల కుమార్తె అక్షర సారీ ఫంక్షన్‌కు ముఖ్య అతిథిగా నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు..

## సుందరాపూర్ రహదారికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చేయూత

- రూ.5 లక్షల సొంత నిధులతో రహదారి అభివృద్ధి
- పల్లెల అభివృద్ధికి నిరంతరం కృషి: ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 06:** కేశంపేట మండలం సుందరాపూర్ గ్రామం నుంచి శ్రీ మహాలింగేశ్వర స్వామి ఆలయం వరకు సుమారు 2.5 కిలోమీటర్ల రహదారిని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రూ.5 లక్షల సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. రహదారి అధ్వానంగా ఉండటంతో భక్తులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి, గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రహదారిపై మొరం పోయించి పనులు పూర్తి చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల కోరిక మేరకు ఆదివారం సుందరాపూర్ గ్రామాన్ని, మహాలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్సీ సందర్శించారు. గ్రామస్తులు ఘన స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సన్మానించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, పల్లెల అభివృద్ధికి తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తెలిపారు. తనను నమ్మి నడిచే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. రహదారి అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్సీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డ్స్‌లో న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీకి ఘన విజయం

- న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ

**విద్యార్థులకు గ్లోబల్ స్టార్ కిడ్స్ అవార్డులు**




**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్06:** హైదరాబాద్‌లో తెలంగాణ అమెచ్యూర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అవార్డ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక గ్లోబల్ ఎక్సలెన్స్ ఐకాన్ అవార్డ్స్–2026లో షాద్‌నగర్ న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. కుంగ్ ఫు విభాగంలో విశేష ప్రతిభ కనబరిచిన నాజ్మా బేగం, ఇషిక రెడ్డి, సునైనా బేగం, వేదాదిత్య, నాగ, కావలి దీక్షిత, దాన్షిక, వాన్షిక, రక్షిత్, చరణ్ తేజ్, కమల్ దత్, సాత్విక్, దినేష్ తదితరులు గ్లోబల్ స్టార్ కిడ్స్ ఐకాన్ అవార్డులను అందుకున్నారు. సినీ కళాకారులు శివం శివరాత్రి, గబ్బర్ సింగ్ సాయిబాబా, దువ్వూరి సంజయ్, సుహాని నాథ్, మాస్టర్ కేశవ్ గౌడ్, అమర్ సింగ్, సం సాయి తదితరుల చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. విద్యార్థుల విజయంపై అకాడమీ శిక్షకులు,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# 15 ఏళ్ల జర్నలిజం ప్రస్థానానికి నంది అవార్డు

**- పల్లాటి రమేష్‌కు ప్రతిష్ఠాత్మక నంది అవార్డు**



**తొలి అక్షరం/షాబాద్, సెప్టెంబర్06:** మీడియా రంగంలో 15 ఏళ్లుగా సేవలందిస్తున్న రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్‌నగర్‌కు చెందిన పల్లాటి రమేష్‌కు ప్రతిష్ఠాత్మక నంది అవార్డు లభించింది. తెలంగాణ అమేచర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అవార్డ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ ఎక్సలెన్స్ ఐకాన్ అవార్డ్స్2026లో సినీ కళాకారులు శివం శివరాత్రి, గబ్బర్ సింగ్ సాయిబాబా చేతుల మీదుగా రమేష్ అవార్డును అందుకున్నారు.జర్నలిజం రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. నియోజకవర్గ రిపోర్టర్‌గా మీడియా ప్రస్థానం ప్రారంభించిన రమేష్ ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు, స్థానిక సమస్యలను వార్తల రూపంలో వెలుగులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఫోకస్ న్యూస్ కరస్పాండెంట్, సబ్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ అవార్డు తనకు ఎంతో ఆనందం, గర్వాన్ని కలిగించిందని, భవిష్యత్తులోనూ నిజాయితీతో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తానని రమేష్ తెలిపారు.

# మోత్కూల గూడలో 'కాంగ్రెస్ బాకీ కార్డుల'తో బీఆర్ఎస్ నాయకులు నిరసన

- పల్లె ప్రగతి ఎక్కడ? కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ఫైర్
- హామీలు అమలు చేయాలి.. గ్రామ సమస్యలు పరిష్కరించాలి





**తొలి అక్షరం/నందిగామ, సెప్టెంబర్06:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో గ్రామాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పూర్తిగా కుంటుపడ్డాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అంజయ్య యాదవ్ పిలుపు మేరకు ఆదివారం నందిగామ మండలం మోత్కూలగూడలో జెట్ట లావణ్య రమేష్ ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన 'పల్లె ప్రగతి' కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలను మార్చామని అన్నారు. పారిశుద్ధ్యం, హరితహారం, మౌలిక వసతులు, గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని గుర్తు చేశారు.ప్రస్తుతం గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, మౌలిక వసతుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి జెట్ట లావణ్య రమేష్, మాజీ సర్పంచ్ వానరసి ఎల్లమ్మ నరసింహులు, ఉప సర్పంచి వానరసి నరసింహ, గ్రామ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మహేష్, టిఆర్ఎస్ పార్టీ వార్డు మెంబర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో అంగరంగ వైభవంగా మహా గురువుల గురుపూజోత్సవం


**ఆర్కే కళా సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన కార్యక్రమం**

**ఆధ్యాత్మిక గురువు ఆచార్య తిరునగరి వెంకటేశ్వర స్వామికి ఘన సన్మానం**

**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 06:** ఆర్కే కళా సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా గురువుల గురుపూజోత్సవ కార్యక్రమం ఆదివారం రవీంద్రభారతి వేదికగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఆచార్య తిరునగరి వెంకటేశ్వర స్వామిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పుల్లేటికుర్తి సంజయ్, వ్యాగ్రా లక్ష్మీ, విశ్వనాథ, నాగేంద్ర కుమార్ తదితరులు మాట్లాడుతూ.. తిరునగరి వెంకటేశ్వర స్వామి గురుముఖంగా తాము తీసుకున్న ఆధ్యాత్మిక సాధనను 41 రోజులపాటు నమ్మకంతో కొనసాగించామని తెలిపారు. ఆ సాధన ద్వారా తమకు అద్భుతమైన ఫలితాలు లభించాయని పేర్కొన్నారు. గురువు గురుపూజ మహోత్సవానికి హాజరుకావడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు.విశ్వహిందూ ఐక్యతే విశ్వశాంతికి మూలంపూజ్య గురువులు




తిరునగరి వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ గురుపూజ కార్యక్రమాలు సనాతన సంప్రదాయంలో అఖండ భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించబడుతున్నాయని అన్నారు. ధర్మో రక్షతి రక్షితః అనే హిందూ ధర్మ సిద్ధాంతమే దీనికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.భారతదేశం కర్మభూమి, ధర్మభూమి అని, విశ్వహిందూ ఐక్యతే విశ్వశాంతికి మూలమని ఆయన అన్నారు. అఖండ హిందూ సంస్కృతిలోని కట్టు, బొట్టు, ఆచారాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నేటి యువతను మరింతగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.నేటి విశ్వహిందూ యువత ఆధ్యాత్మిక తరంగంగా ముందుకు సాగుతోందని, ప్రపంచ దేశాలకు భారతీయ సనాతన సంస్కృతి తలమానికంగా




నిలుస్తోందని తిరునగరి వెంకటేశ్వర స్వామి వ్యాఖ్యానించారు.కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు, కళాకారులు, ఫౌండేషన్ ప్రతినిధులు, భక్తులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

**మంద కృష్ణ మాదిగ ఆదేశాలతో**

**సంస్థాగత నిర్మాణానికి శ్రీకారం**

**కొత్త మండల కమిటీని ప్రకటించిన నాయకత్వం**

**కోరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో సమావేశం**

**తొలి అక్షరం/ఉప్పల్, సెప్టెంబర్ 6:** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, మండల ఇంచార్జ్ కోరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఉప్పల్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ఇంచార్జ్‌లు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, కేశపాగ రాంచందర్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్



కుమార్ మాదిగ సమావేశానికి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఉప్పల్ మండలంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం ఉప్పల్ ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా మిద్దెపాక క్రాంతి మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దాసరి యాదగిరి, ఉపాధ్యక్షులుగా చిలుకూరి శ్రీకాంత్, మోతే సురేష్ మాదిగ, కోరపాక యోగేష్ మాదిగ, జి. మహేష్ బాబులను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా తాళ్లపల్లి మహేష్, కందుల రాజు, చింత మధు తదితరులను ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

# 30 మంది రోగులతో గుర్తురు నుండి హైదరాబాద్‌కు వెళ్లిన మెడికల్ బస్సు

**- గ్రామ సర్పంచ్ విసంపల్లి కవితా బాలకృష్ణ వెల్లడి**

**- రోగులకు ధైర్యం నింపి పంపించిన విసంపల్లి బాలకృష్ణ**

**తొలి అక్షరం/తొర్రూరు సెప్టెంబర్ 6:** గ్రామంలో అందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని మా ధ్యేయం అంటున గుర్తురు గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ.గ్రామ సర్పంచిగా గెలిచిన అనంతరం ఇది రెండవ మెడికల్ క్యాంపు గా గ్రామస్తులందరికీ గత నాలుగు రోజుల క్రితం వైద్య పరీక్షలు నిర్వహించి



వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న గ్రామస్తులను వారి బాధలను గుర్తించి హైదరాబాదులోని మల్లారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కు పంపించడం జరిగిందని కవితా బాలకృష్ణ పేర్కొన్నారు. మల్లారెడ్డి మెడికల్ ఇన్స్టిట్యూట్ లోని వైద్యులు ఓబుల్ రెడ్డి సలహా సూచనల మేరకు సర్పంచ్ కవితా బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని గుర్తుర్ గ్రామంలోగత నాలుగు నెలల క్రితం గ్రామంలోని కంటి బాధలతో బాధపడుతున్న వృద్ధులను ఇదే ఇన్స్టిట్యూట్ కు పంపించి వారికి తగిన కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామం నుండి బయలుదేరిన 30 మంది రోగులకు ఆసుపత్రిలో ఐదు రోజులు వైద్య పరీక్షలు నిర్వహించి గ్రామం నుండి తీసుకువెళ్లిన బస్సులోని తిరిగి క్షేమంగా ఇల్లు చేర్పించుకునే బాధ్యత మాపై ఉందని విసంపల్లి బాలకృష్ణ పేర్కొన్నారు. వైద్య పరీక్షలకు వెళ్లిన వారందరి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధైర్య పడకుండా ఉండేందుకు వారితో పాటు గ్రామం నుండి ఒక ఇద్దరిని పంపించామన్నారు. బస్సులో వెళ్ళిన రోగులకు అన్ని రకాల వస్తువులను ఇనిస్టూట్ వారే ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. వైద్య పరీక్షల కోసం వెళ్ళిన రోగులందరూ క్షేమంగా తిరిగి రావాలని మనము కోరుకుందాం.

# కె. రాఘవ రావుకు ఉత్తమ జిల్లా ఉపాధ్యాయ అవార్డు

**తొలి అక్షరం/ఏన్కూర్ సెప్టెంబర్6:** విద్యారంగంలో మూడు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న జెడ్పీహెచెస్ ఏన్కూరు పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు కె. రాఘవరావు కు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనను జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి సత్కరించారు.కె. రాఘవ 1996 నవంబర్ 14న ఏన్కూరు మండలంలోని ఎంపియుపిఎస్ రాయమాధారం పాఠశాలలో ఎస్ జిబీటీ గా తన ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించారు. అనంతరం ఎంపీపీఎస్ రాజలింగాలలో సేవలందించారు. 2002 నవంబర్ 1న ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది జెడ్పీహెచెస్ తిమ్మారావుపేటలో విధులు నిర్వహించారు. తదనంతరం జెడ్పీహెచెస్ ముచ్చర్ల జస్తిపల్లి, జెడ్పీహెచెస్ జూలూరుపాడు పాఠశాలల్లో సేవలందించి ప్రస్తుతం జెడ్పీహెచెస్




ఏన్కూరులో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు, విద్యాబోధనలో నూతన పద్ధతులను అనుసరిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు. మొత్తం 30 సంవత్సరాల సుదీర్ఘ ఉపాధ్యాయ సేవల్లో 6 సంవత్సరాలు ఎస్ జిబీటీ గా, 24 సంవత్సరాలు స్కూల్ అసిస్టెంట్‌గా సేవలందించారు.ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. కె. రాఘవరావు కు పలువురు అభినందనలు తెలిపారు.

# ముంబై ఇండియన్స్ సంచలన నిర్ణయం.. హార్దిక్ పాండ్యా సహా 8 మందికి గుడ్‌బై..?



2020లో చివరిసారిగా ఐపీఎల్ టైటిల్ గెలిచిన ముంబయి ఇండియన్స్ ఆ తర్వాతి ఆరు సీజన్లలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, 2026 సీజన్‌లో ముంబై తొమ్మిదో స్థానంలో నిలిచింది. దీంతో వచ్చే సీజన్‌కు ముందు జట్టును పునర్నిర్మించే ఆలోచనలో ఫ్రాంచైజీ ఉండొచ్చనే అంచనాలు పెరిగాయి. ఐపీఎల్ 2027 రిటెన్షన్ జాబితా ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అయినా కోర్ ఆటగాళ్లలో కొందరిని కొనసాగించే అవకాశం ఉంది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, తిలక్ వర్మతో పాటు రియాన్ రికెల్టన్, విల్ జాక్స్, నామన్ ధీర్, కార్బిన్ బోష్, మిచెల్ సాంట్నర్, అల్లా గజన్‌ఫర్ పేర్లు రిటెన్షన్ రేసులో ఉన్నట్లు సమాచారం.హార్దిక్ పాండ్యా విషయంలో ఏం జరగొచ్చు?హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపైనే ఇప్పుడు పెద్ద చర్చ జరుగుతోంది. 2024 నుంచి ముంబై కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న హార్దిక్ వచ్చే సీజన్‌లో మరో ఫ్రాంచైజీకి వెళ్లే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. ఆయనను ట్రేడ్ చేయడం లేదా నేరుగా విడుదల చేయడం జరిగే ప్రస్తావిస్తున్నారు.ఎక్కువమంది చదివినది: 59 ఫోర్లు, 1 సిక్స్.. ఒకే ఇన్నింగ్స్‌లో 451 పరుగులతో బీభత్సం.. ప్రపంచ రికార్డ్‌నే షేక్ చేసిన దిగ్గజాలు..!ఒకే ఇన్నింగ్స్‌లో 451 పరుగులు.. ప్రపంచ రికార్డ్‌నే షేక్ చేశారుగాహార్దిక్ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్ ముందంజలో ట్రెంట్ బౌల్ట్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్, రాబిన్ మింజ్, దానిష్ మాలేవార్ పేర్లు కూడా విడుదలయ్యే ఆటగాళ్ల జాబితాలో వినిపిస్తున్నాయి. ఈ మార్పులతో వేలానికి ముందు ముంబై పర్స్ విలువ పెంచుకోవాలని చూస్తున్నట్లు అంచనా. తద్వారా అవసరమైన స్థానాల్లో కొత్త ఆటగాళ్లను తీసుకునే అవకాశం ఉంటుంది.ముంబయి ఇండియన్స్ రిటెన్షన్ లిస్ట్ ఇంకా అధికారికంగా రాలేదు. అయినా హార్దిక్ పాండ్యా సహా ఎనిమిది మంది విడుదలయ్యే అవకాశాలపై వస్తున్న గ్స్, లక్నో సూపర్ జెయింట్స్ కూడా ఆసక్తి చూపే జట్లుగా పేర్కొంటున్నారు. అయితే తుది నిర్ణయం ఫ్రాంచైజీల అధికారిక ప్రకటనల తర్వాతే స్పష్టమవుతుంది.మరో ఏడుగురిపైనా వేటు?హార్దిక్‌తో పాటు క్వింటన్ డి కాక్, ట్రెంట్ బౌల్ట్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్, రాబిన్ మింజ్, దానిష్ మాలేవార్ పేర్లు కూడా విడుదలయ్యే ఆటగాళ్ల జాబితాలో వినిపిస్తున్నాయి. ఈ మార్పులతో వేలానికి ముందు ముంబై పర్స్ విలువ పెంచుకోవాలని చూస్తున్నట్లు అంచనా. తద్వారా అవసరమైన స్థానాల్లో కొత్త ఆటగాళ్లను తీసుకునే అవకాశం ఉంటుంది.ముంబయి ఇండియన్స్ రిటెన్షన్ లిస్ట్ ఇంకా అధికారికంగా రాలేదు. అయినా హార్దిక్ పాండ్యా సహా ఎనిమిది మంది విడుదలయ్యే అవకాశాలపై వస్తున్న అంచనాలు నిజమైతే.. ఐపీఎల్ 2027 (ఖా 2027)కి ముందు ముంబై జట్టు రూపమే

# ఎంత జీతం ఉంటే బ్యాంకులు ఈజీగా పర్సనల్ లోన్స్ ఇస్తాయి..? ఈ రూల్స్ గురించి తెలుసుకోండి..




అత్యవసర ఆర్థిక అవసరాలు ఏర్పడినప్పుడు అందరికీ టక్కున గుర్తొచ్చేది పర్సనల్ లోన్. ఎలాంటి ఆస్తులు లేదా పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేకపోవడంతో లోన్ తీసుకునేవారి సంఖ్య ఎక్కువైంది. అయితే దరఖాస్తు చేసిన వెంటనే బ్యాంకులు అంత ఈజీగా రుణాలు మంజూరు చేయవు. ముఖ్యంగా రికవరీకి ఎలాంటి హామీ ఉండదు కాబట్టి దరఖాస్తుదారుడి తిరిగి చెల్లించే సామర్థ్యంపై బ్యాంకులు కఠినమైన తనిఖీలు నిర్వహిస్తాయి. క్రెడిట్ స్కోర్, వయస్సు, ఉద్యోగ స్థిరత్వంతో పాటు ప్రధానంగా కనీస నెలవారీ ఆదాయం, డెట్ టు ఇన్‌కమ్ రేషియోను బ్యాంకులు ప్రామాణికంగా తీసుకుంటాయి.అసలు ఱ× నిష్పత్తి అంటే ఏమిటి? ఇది ఎందుకు కీలకం?వ్యక్తిగత రుణం మంజూరు ప్రక్రియలో రుణ-ఆదాయ నిష్పత్తి అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. ఒక వ్యక్తి సంపాదిస్తున్న నెలవారీ ఆదాయంలో ఇప్పటికే ఉన్న పాత రుణాల జువీ×లు చెల్లించడానికి ఎంత శాతం వెళ్తోందో లెక్కించే విధానమే ఈ ఱ×. ఉదాహరణకు.. ఒక వ్యక్తి నెలవారీ జీతం రూ.50,000 ఉండి, అతను ఇప్పటికే ఉన్న రుణాల కోసం నెలకు రూ.12,500 ఈఎంఐ చెల్లిస్తుంటే, అతని ఱ× నిష్పత్తి 25శాతంగా లెక్కించబడుతుంది. సాధారణంగా ఱ× నిష్పత్తి 35శాతం లేదా అంతకంటే తక్కువ ఉంటే బ్యాంకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెంటనే లోన్ మంజూరు చేస్తాయి. 40 నుంచి 45శాతం ఱ× ఉంటేలి కొన్ని బ్యాంకులు రుణం ఇచ్చేందుకు అంగీకరించినా.. కో-అప్లికెంట్ లేదా గ్యారెంటర్‌ను పెట్టాలని కోరడం, లోన్ మొత్తం తగ్గించడం లేదా కాలపరిమితిని పెంచడం వంటి కఠిన షరతులు విధిస్తాయి.ప్రముఖ బ్యాంకుల్లో కనీస ఆదాయ పరిమితులుపర్సనల్ లోన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వివిధ బ్యాంకులు నిర్దేశించిన కనీస నెలవారీ జీత ప్రమాణాలు ఇలా ఉన్నాయి.హెచ్‌డీఎఫ్‌సీ బపరిగణనలోకి తీసుకుంటారు.యాక్సిస్ బ్యాంకులో ఇప్పటికే ఖాతా ఉన్నవారికి కనీస పరిమితి రూ.15,000. కొత్త కస్టమర్లకు అయితే కనీసం రూ.25,000 ఉండాలి.కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత కస్టమర్లకు రూ.25,000, ఇతర బ్యాంక్ ఖాతాదారులకు రూ.30,000. అదే కోటక్ ఉద్యోగులైతే రూ.20,000 కనీస జీతం ఉండాలి.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రభుత్వ, రక్షణ రంగ ఉద్యోగులకు కనీస వేతనం రూ.20,000. కార్పొరేట్ ఉద్యోగులకు కనీస జీత పరిమితి రూ.25,000గా నిర్ణయించారు.కేవలం అధిక జీతం ఉండటమే కాకుండా, గతంలో తీసుకున్న ఈఎంఐల భారం తక్కువగా ఉన్నప్పుడే ఎక్కువ మొత్తం పర్సనల్ లోన్ తక్కువ వడ్డీకే లభించే అవకాశం ఉంటుంది. అందుకే లోన్ కోసం అప్లై చేసేముందే మీ సిబిల్ స్కోర్, నెలవారీ ఈఎంఐల శాతాన్ని ఒకసారి సరిచూసుకోవడం మంచిది.

# కేవలం రూ.50 వేలు ఖర్చు పెడితే చాలు నెలకు రూ.60 వేల సంపాదన.



వ్యాపారం అంటే లక్షలు, కోట్లతో కూడుకున్న పని అని చాలామంది పొరపాటు పడుతుంటారు. మీరు బిజినెస్ స్టార్ట్ చేయాలంటే లక్షలు, కోట్లు అవసరం లేదు. తక్కువ పెట్టుబడితో మొదలుపెట్టగలిగే వ్యాపారాలు చాలానే ఉన్నాయి. మీ దగ్గర రూ.50 వేలు ఉన్నా మంచి వ్యాపారం ప్రారంభించి అధిక ఆదాయం పొందవచ్చు. సరైన ప్లానింగ్ తెలివి, హార్డ్ వర్క్ చేసే తత్వం ఉంటే బాగా డబ్బులు సంపాదించవచ్చు. బిజినెస్ స్టార్ట్ చేసిన తక్కువ సమయంలోనే డబ్బులు మీ చేతిలోకి వస్తాయి. రూ.50 వేలలో మొదలుపెట్టగలిగే ఐదు బెస్ట్ బిజినెస్‌ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

హోమ్ ఫుడ్ బిజినెస్

ఫుడ్ బిజినెస్ చేయాలంటే రూమ్ అవసరం లేదు. కేవలం మీ వంటిట్లోనే ఆహార పదార్థాలు వండి విక్రయించవచ్చు. ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులకు మీరు విక్రయించి డబ్బులు సంపాదించవచ్చు. రోజుకు మీరు 30 నుంచి 50 మందికి అందించినా నెలకు రూ.60 వేల వరకు సంపాదించవచ్చు. ఖర్చులు పోను మీకు రూ.30 వేల వరకు మిగులుతాయి. అయితే కిరాణా సరుకులకు రూ.15 వేలు, ప్యాకింగ్ మెటీరియల్స్‌కు రూ.10 వేలు, డెలివరీ రూ.15 వేలు ఖర్చు అవుతుంది. ఇక వంట పాత్రలకు రూ.10 వేలు అవుతుంది. రూ.50 వేల ఖర్చుతో మీరు ఈ వ్యాపారం స్టార్ట్ చేయవచ్చు.

ఇక మొబైల్ యాక్సెసరీస్ విక్రయం

మొబైల్ ఛార్జర్లు, ఇయర్ ఫోన్లు, పవర్ బ్యాంక్, టెంపర్డ్ గ్లాస్ వంటివి విక్రయించడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ఎక్కువగా విక్రయాలు జరిగితే నెలకు రూ.25 నుంచి రూ.40 వేల వరకు మీరు సంపాదించవచ్చు. స్టాక్ ఖర్చు రూ.35 వేలు, షెల్ఫ్ రూ.10 వేలు, ప్రచారానికి రూ.5 వేలు ఖర్చు అవుతుంది.

ప్రింటింగ్, జిరాక్స్

జిరాక్స్, లామినేషన్, కలర్ ప్రింట్, స్పైరల్ బైండింగ్ వంటి వాటి ద్వారా మీరు డబ్బులు సంపాదించవచ్చు. స్కూల్స్, కాలేజీలు, ఆఫీసుల దగ్గర మీరు ఈ వ్యాపారం స్టార్ట్ చేస్తే డబ్బులు ఎక్కువగా వస్తాయి. నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదించవచ్చు. ప్రింటర్‌కు రూ.20 వేలు, కంప్యూటర్ రూ.20 వేలు, పేపర్, ఇంక్ రూ.10 వేలు ఖర్చు అవుతుంది.

నేచురల్ ప్రొడక్ట్స్ అమ్మకం

రాగి పిండి, కారం పొడి, సజ్జ పిండి, పసుపు, ఆర్గానిక్ బెల్లం, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ వంటి వాటివి విక్రయించే ఆదాయ పొందవచ్చు. నెలకు రూ.50 వేల వరకు సంపాదించవచ్చు.

# భారత్ చేతిలో ఘోర పరాభవం



.. పాకిస్థాన్ మహిళల జట్టు చరిత్రలోనే చెత్త రికార్డు


దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో శనివారం జరిగిన మహిళల ఆసియా కప్ 2026 గ్రూప్-ఎ మ్యాచ్‌లో భారత బౌలర్లు చారిత్రక విజయాన్ని నమోదు చేశారు. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను కేవలం 55 పరుగులకే కుప్పకూల్చి, తమ ఆధిపత్యాన్ని సగర్వంగా చాటుకున్నారు. మహిళల ఆసియా కప్ తొమ్మిదో మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు తీవ్ర నిరాశపరిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆ జట్టు భారత కచ్చితమైన బౌలింగ్ దాటికి తాళలేక 18.1 ఓవర్లలో 55 పరుగులకే ఆలౌట్ అయింది. అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలోనే పాకిస్థాన్ మహిళల జట్టుకు ఇదే అత్యంత తక్కువ స్కోరు కావడం గమనార్హం. గతంలో 2024 టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌పై చేసిన 56 పరుగుల రికార్డును అధిగమించి, ఈ మ్యాచ్ ద్వారా సరికొత్త చేదు జ్ఞాపకాన్ని మూటగట్టుకుంది.ఇన్నింగ్స్ ఆరంభంలో పాకిస్థాన్ ఓపెనర్లు వికెట్ నష్టపోకుండా మొదటి నాలుగు ఓవర్లలో 23 పరుగులు చేసి ఫర్వాలేదనిపించారు. అయితే తొలి ఓవర్ బౌలింగ్‌కు వచ్చిన భారత స్టార్ ఆల్‌రౌండర్ షెఫాలీ వర్మ వెంటనే వికెట్ తీసి విచ్ఛిన్నానికి నాంది పలికింది. పవర్‌ప్లే ముగిసే సమయానికి పాకిస్థాన్ 23/0 నుంచి 29/3 వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. అక్కడి నుంచి భారత స్పిన్ విభాగానికి తిరుగులేకుండా పోయింది.పవర్‌ప్లే తర్వాత భారత స్పిన్నర్లు దీప్తి శర్మ, ప్రేమా రావత్, శ్రీ చరణి మైదానంలో వికెట్ల పండగ చేసుకున్నారు. వీరి ధాటికి పాకిస్థాన్ స్కోరు 27/0 నుంచి ఒక్కసారిగా 35/6కి పడిపోయింది. ఉమ్మా-ఎ-హానీ, ఐమన్ ఫాతిమా కొంతసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, ఒక రనౌట్ రూపంలో వారి పోరాటం ముగిసింది. ఆఖరి వరుస బ్యాటర్లు కూడా క్యూ కట్టడంతో పాక్ ఇన్నింగ్స్ 55 పరుగుల వద్దే ముగిసింది.భారత్‌పై నమోదైన ఐదో అత్యల్ప స్కోరుపాకిస్థాన్ నమోదు చేసిన 55 పరుగుల స్కోరు వారికి ఆల్-టైమ్ లోయెస్ట్ కాగా, భారత మహిళల జట్టుపై ప్రత్యర్థులు చేసిన ఐదో అత్యల్ప స్కోరుగా నిలిచింది. ఈ జాబితాలో 2018లో క?చిలాలంపూర్‌లో భారత్‌పై 27 పరుగులకే ఆలౌట్ అయిన మలేషియా అగ్రస్థానంలో ఉండగా, థాయిలాండ్ (37 పరుగులు), బంగ్లాదేశ్ (51, 54 పరుగులు) తదుపరి స్థానాల్లో ఉన్నాయి. తొలి మ్యాచ్‌లో థాయిలాండ్‌పై విజయం సాధించి ఆసియా కప్‌లోకి అడుగుపెట్టిన పాకిస్థాన్‌కు, భారత్ చేతిలో ఎదురైన ఈ ఘోర పరాభవం కోలుకోలేని దెబ్బగా మారింది.

# కప్ టీమిండియా గెలిచినా.. పట్టుకెళ్లేది మాత్రం పాకిస్థానోడే! ఎందుకిలా..?




ఉమెన్స్ ఆసియా కప్ 2026 తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో క్రికెట్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత మహిళల జట్టు వరుస విజయాలతో దూసుకెళ్తోంది. లీగ్ దశలోనే మూడు విజయాలు నమోదు చేసి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్న టీమిండియా.. ప్రస్తుతం టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా కనిపిస్తోంది. అయితే ఆటతో పాటు సెప్టెంబర్ 13న దుబాయ్ ఇంటర్నే షనల్ స్టేడియంలో జరగనున్న ట్రోఫీ ప్రదానోత్సవంపైనా ఆసక్తి పెరుగుతోంది.ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఫైనల్‌కు ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీ అందించే అవకాశం ఉందన్న వార్తలు ఈ చర్చకు కారణమయ్యాయి. ఒకవేళ భారత మహిళల జట్టు ఫైనల్‌కు చేరుకుని టైటిల్ సాధిస్తే.. నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ స్వీకరిస్తుందా లేదా అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఈ సందేహాలకు గత ఏడాది జరిగిన పురుషుల టీ20 ఆసియా కప్ పరిణామాలే నేపథ్యంగా నిలిచాయి. ఫైనల్లో పాకిస్థాన్‌పై విజయం సాధించిన సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు టైటిల్ గెలుచుకుంది. అయితే ఆ సమయంలో నఖ్వీ చేతుల మీదుగా విజేత ట్రోఫీ, పతకాలు స్వీకరించేందుకు భారత జట్టు నిరాకరించింది. ఆటగాళ్లు వ్యక్తిగత అవార్డులు మాత్రమే తీసుకుని, ప్రధాన ట్రోఫీ ప్రదాన కార్యక్రమానికి దూరంగా ఉన్నారు.ఈ పరిణామంతో నఖ్వీ ట్రోఫీని తీసుకుని స్టేడియం నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఆ ట్రోఫీని తిరిగి పొందేందుకు బీసీసీఐ ప్రయత్నించినప్పటికీ, అది ఏసీసీ వద్దే ఉందన్న సమాచారం వెలువడింది. ఇప్పుడు మహిళల టోర్నీలో భారత్ ఫైనల్ చేరితే ఇదే తరహా పరిస్థితి మరో సారి ఎదురవుతుందా అనే చర్చ మొదలైంది. అయితే ప్రస్తుతం భారత మహిళల జట్టు ఇంకా ఫైనల్ బెర్త్‌ను అధికారికంగా ఖరారు చేసుకోలేదు. ఒకవేళ టైటిల్ పోరులో విజయం సాధిస్తే.. ట్రోఫీ ప్రదానోత్సవంలో భారత ఆటగాళ్లు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ అంశంపై అధికారికంగా భారత జట్టు లేదా బీసీసీఐ నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడలేదు.

# పోస్టాఫీసులో టాప్ 5 సేవింగ్స్ స్కీమ్ గురించి మీకు తెలుసా..?



ఆర్థిక భద్రత, వృద్ధి కోసం ప్రభుత్వ మద్దతుగల, సురక్షితమైన పెట్టుబడి ఎంపికలు ఎల్లప్పుడూ ప్రాధాన్యతను పొందుతాయి. పోస్ట్ ఆఫీస్ అనేక రకాల పొదుపు పథకాలను అందిస్తుంది. ఇవి పౌరులకు సంపదను పెంపొందించుకోవడా నికి, పన్ను ప్రయోజనాలను పొందడానికి, స్థిరమైన ఆదాయాన్ని సంపాదించడానికి, భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి సహాయపడతాయి. ఈ వ్యాసం టాప్ 5 పోస్ట్ ఆఫీస్ పథకాలను వివరంగా తెలుసుకుం దాం. అందులో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ , కిసాన్ వికాస్ పత్ర , సుకన్య సమృద్ధి యోజన , పోస్ట్ ఆఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ , సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ ృాఖీ అనేది 15 సంవత్సరాల కాలపరిమితి కలిగిన దీర్ఘకాలిక పెట్టుబడి పథకం. ఈ ఖాతా ను బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ ద్వారా ఎవరైనా భారతీయ పౌరులు తెరవవచ్చు (ఎన్‌ఆర్‌ఐలు మినహా). ఇది సంవత్సరానికి కనీసం రూ.500 నుండి గరిష్టంగా రూ.1,50,000 వరకు పెట్టుబడి పెట్టడానికి అనుమతిస్తుంది. ప్రస్తుత వడ్డీ రేటు సాధారణంగా 7.1% ఉంటుంది. పీపీఎఫ్ ముఖ్యమైన ప్రయోజనం ట్రిపుల్ జు (ఎగ్జమ్ట్, ఎగ్జమ్ట్, ఎగ్జమ్ట్) పన్ను ప్రయోజనం. సెక్షన్ 80జ కింద రూ.1,50,000 వరకు పెట్టుబడులకు పన్ను మినహాయింపు లభిస్తుంది. సంపాదించిన వడ్డీ, అలాగే మెచ్యూరిటీ మొత్తం పూర్తిగా పన్ను రహితం. 15 సంవత్సరాల తర్వాత, రూ.1,50,000 వార్షిక పెట్టుబడితో రూ.40 లక్షలకు పైగా రాబడిని పొందవచ్చు. 4వ ఆర్థిక సంవత్సరం నుండి రుణాలు తీసుకోవచ్చు. 6వ ఆర్థిక సంవత్సరం నుండి పాక్షిక ఉపసంహరణలు అనుమతి ఉంటుంద్రా పథకం మీ పెట్టుబడిని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ట పరిమితి లేదు. ప్రస్తుత వడ్డీ రేటు 7.5% కాగా, పెట్టుబడి మొత్తం 115 నెలల్లో రెట్టింపు అవుతుంది. ఈ పథకం 80జ పన్ను ప్రయోజనం కిందకు రాదు. సంపాదించిన వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. దీర్ఘకాలికంగా తమ డబ్బు రెట్టింపు కావాలనుకునే వారికి ఖ్యా ఒక ఆకర్షణీయమైన ఎంపిక. 3. సుకన్య సమృద్ధి యోజన 1, జూలై 1, అక్టోబర్ 1, జనవరి 1న) నేరుగా పెట్టుబడిదారుడి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఉదాహరణకు రూ.30 లక్షల పెట్టుబడిపై ప్రతి మూడు నెలలకోసారి రూ.61,500 వడ్డీ లభిస్తుంది. సెక్షన్ 80జ కింద పన్ను ప్రయోజనాలు కూడా అందు బాటులో ఉన్నాయి, కానీ సంపాదించిన వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. ఈ పోస్ట్ ఆఫీస్ పథకాలు వివిధ ఆర్థిక అవసరాలు, వయస్సు వర్గాలకు అనుగుణంగా రూపొందించారు. పెట్టుబడిదారులు తమ లక్ష్యాలు, రిస్క్ ం సరిపోయే పథకాన్ని ఎంచుకోవడా నికి ప్రతి పథకం లక్షణాలను జాగ్రత్తగా పరిశీలించాలి.



ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్రాగన్' చిత్రంతో హీరోయిన్ కయాదు లోహర్ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతకు ముందుకు ఈ అమ్మడు తెలుగులో అల్లూరి అనే సినిమా చేసింది. కానీ ఆ సినిమా పెద్దగా ఆకట్టుకుకొలేదు. ఇక ఈ చిన్నది ఫంకీ సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ను ఆకట్టుకుంది. కానీ ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం ఆమె తమిళం, తెలుగు చిత్రసీమలలో చాలా బిజీగా ఉంది. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. మరోవైపు తెలుగులోనూ బ్యాక్ టూ బ్యాక్ అవకాశాలు అందుకుంటుంది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమాలో కాయదు హీరోయిన్ గా నటిస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా కయాదు లోహర్ చేసిన కొన్ని కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో ఆడవాళ్లను చూపించే విధానంపై కయాదు లోహర్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.సినిమాల్లో మహిళలను కేవలం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే ఐటెమ్ లా చూపించే ధోరణిని తాను ఒప్పుకోనని తేల్చి చెప్పింది కాయదు. స్పష్టం చేశారు యంగ్ హీరోయిన్ కయాదు లోహర్. కథ, పాత్ర డిమాండ్ చేస్తే పరిమితులకు లోబడి నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కేవలం లైమ్ లైట్ కోసమో లేదా సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడానికో అసభ్యకరమైన సన్నివేశాల్లో నటించే ఆలోచన తనకు అస్సలు లేదని చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.అస్సాంలహీరోయిన్ కయాదు లోహర్. కథ, పాత్ర డిమాండ్ చేస్తే పరిమితులకు లోబడి నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కేవలం లైమ్ లైట్ కోసమో లేదా సోషల్ లో పుట్టి పెరిగినా దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో సత్తా చాటుతోంది కాయదు లోహర్. తన అందం, అభినయంతో కుర్రకారులో క్రేజ్ తెచ్చుకుందీ ముద్దుగుమ్మ. మోడలింగ్ తో కెరీర్ మొదలు పెట్టిన కాయదు లోహర్. 'టైమ్స్ ఫ్రెష్ ఫేస్' పోటీల్లో విజేతగా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించిన కయాదు ఆ తర్వాత నటనారంగం వైపు అడుగులు వేశారు. కన్నడలో 'ముగిల్‌పేటే' చిత్రంతో కెరీర్ ప్రారంభించింది ఈ ముద్దుగుమ్మ ..

## ఆడపిల్లలంటే ఆట వస్తువులు కాదు.. అలా చూపిస్తే ఒప్పుకోను


**కయాదు లోహర్**


టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ ది ప్యారడైజ్. న్యాచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ ఇది. దసరా సినిమాతో బాక్సాఫీస్ షేక్ చేసిన డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ఆయా షేర్ సాంగ్ నెట్టింట సంచలనం సృష్టించింది. ఇక ఇటీవల విడుదలైన ఏశనాగుల సాంగ్ ఇప్పుడు యూట్యూబ్ ను ఊపేస్తుంది. ఈ పాటకు మాస్ అడియన్స్ ఎక్కువగా కనెక్ట్ అయ్యారు. ప్రస్తుతం ఈ మూవీ సాంగ్ మిలియన్ వ్యూస్ తో దూసుకుపోతుంది. ఇదిలా ఉంటే ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా విడుదల తేదీకి సంబంధించి సోషల్ మీడియాలో పలు పుకార్లు ప్రచారంలోకి రావడంతో, మేకర్స్ రిలీజ్ డేట్‌పై మరోసారి

## నాని ది ప్యారడైజ్ మూవీ రిలీజ్ డేట్ ఇదే.. మరోసారి క్లారిటీ ఇచ్చిన మేకర్స్..




స్పష్టతనిచ్చారు. సరిగ్గా మునుపటి ప్రకటన ప్రకారమే ఈ చిత్రం సెప్టెంబర్ 24, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుందని చిత్ర బృందం స్పష్టం చేసింది.'దసరా' వంటి భారీ బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత నాని -- శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది ప్యారడైజ్' పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ చిత్రంలో నాని మునుపెన్నడూ చూడని సరికొత్త, రగ్గడ్ మాస్ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ సినిమాలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుండగా, రాఘవ్ జుయాల్, సోనాలి కులకర్ణి, తనికెళ్ల భరణి, బాబు మోహన్, సంపూర్ణేష్ బాబు తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. అంతేకాకుండా, నటి కీర్తి సురేష్, నాని నటించిన ఏశనాగుల సాంగ్ దుమ్మురేపుతుంది.తాజాగా ది ప్యారడైజ్ మేకర్స్ అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పారు. నాని సినీ ప్రయాణం 18 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన బిగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ మూవీ రిలీజ్ తేదీపై ఎలాంటి సందేహాలు అక్కర్లేదని స్పష్టం చేశారు. ముందుగా ప్రకటించిన తేదీ సెప్టెంబర్ 24న థియేటర్లలో తీసుకురానున్నట్లు ఓ వీడియోను షేర్ చేశారు. దీంతో ఈ మూవీ రిలీజ్ విషయంలో క్లారిటీ వచ్చింది.





## ఇరుముడి' సూపర్ హిట్ సాంగ్.. ఫుల్ వీడియో వచ్చేసింది..

మాస్ మహరాజా రవితేజ– శివ నిర్వాణ కాంబినేషన్ లో వచ్చిన లేటెస్ట్ సినిమా 'ఇరుముడి'. తండ్రి, కూతుళ్ల సెంటిమెంట్ తో తెరకెక్కిన ఈ సినిమా సంచలన విజయం సాధించింది. ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఇరుముడి సినిమా ఇప్పటికే రూ. 200 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. రిలీజై మూడు వారాలు గడుస్తున్నా ఈ సినిమా హౌస్ ఫుల్ కలెక్షన్లతో ఆడుతుండడం విశేషం. చాలా చోట్ల ట్రాక్టర్లతో వెళ్లి మరీ థియేటర్లలో ఈ సినిమాను చూస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఇరుముడి సినిమాను నిర్మించారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించింది. అలాగే సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక కీలక పాత్రలు పోషించారు. ఇక ఈ సినిమాలో రవితేజ కూతురిగా నటించిన నక్షత్ర ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లింది. అలాగే కోలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన ఈ పాటలు సినిమా విజయంలో కీలక పాత్రలు పోషించాయి.ఇదిలా ఉంటే ఇరుముడి సినిమా నుంచి తాజాగా మరో సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్. కార్తీకమాసం ఫుల్ వీడియో పాటను ఇరుముడి టీమ్ విడుదల చేసింది. ఈ పాటకు డైరెక్టర్ శివ నిర్వాణ లిరిక్స్ అందించడం విశేషం. అలాగే మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ పాడడంతో పాటు కంపోజ్ చేశారు. అయ్యప్ప స్వామి భక్తి దీక్ష విశిష్టతను, ఆధ్యాత్మిక పరివర్తనను అత్యంత హృద్యంగా ఆవిష్కరిస్తూ ఈ 'కార్తీకమాసం..' నూ రూపొందించారు. మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. కాగా ఇరుముడి సినిమాలోని పాటలన్నీ చార్ట్ బస్టర్ గా నిలిచింది. ముఖ్యంగా 'మల్లెపూల పల్లకి సాంగ్'కు ఆడియెన్స్ థియేటర్లలో పూజలు, హారతులు పడుతున్నారు. ఇటీవలే ఈ సాంగ్ ఫుల్ వీడియోను కూడా రిలీజ్ చేశారు మేకర్స్.

## ఆ రోజు షూటింగ్ లో ఒక్కరు కూడా నన్ను పేరుపెట్టి పిలవలేదు.






ప్రముఖ నటుడు సాయి కుమార్ తన సినీ ప్రస్థానాన్ని, అగ్రతారలు అలాగే దిగ్గజ దర్శకులతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. ముఖ్యంగా సూపర్ స్టార్ కృష్ణ గారితో తన తండ్రికి ఉన్న సంబంధాన్ని, తానూ కృష్ణ గారితో కలిసి పనిచేసిన మధురానుభూతులను పంచుకున్నారు. తన తండ్రి, కృష్ణ గారు, శోభన్ బాబు గారు వంటి వారు దాదాపు ఒకే సమయంలో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారని సాయి కుమార్ వెల్లడించారు. తన తండ్రి ఎన్నో చిత్రాలకు డబ్బింగ్ చెప్పేవారని, కృష్ణ గారు కూడా ఆయనతో అనేక మంచి పాత్రలు చేయించారని స్మరించుకున్నారు. కృష్ణ గారు నటించిన విజయవంతమైన చిత్రం గూఢచారి 116లో తన తండ్రి ఫైట్లు చేశారని, ఆ సినిమా పెద్ద హిట్‌గా నిలిచిందని పేర్కొన్నారు.తన సినీ జీవితం ప్రారంభంలో డబ్బింగ్‌లు చెప్పడంతో పాటు, నటుడిగా కూడా అవకాశాలు వెతుక్కున్నానని సాయి కుమార్ తెలిపారు. మురళీ మోహన్ రావు గారి దర్శకత్వంలో ఒక చిత్రంలో హోటల్ రిసెప్షనిస్ట్‌గా నటించానని, అది మంచి సినిమా అని గుర్తుచేసుకున్నారు. ఆ తరువాత, ఒక రోజు దర్శకుడు గోపాల్ గారు ఫోన్ చేసి అగ్ని పర్వతం చిత్రంలో విజయశాంతి గారి భర్త పాత్ర ఉందని, చేస్తావా అని అడిగారని తెలిపారు. వెంటనే అంగీకరించి షూటింగ్ కు వెళ్లగా, లొకేషన్‌లో ఎవరూ తనను పేరుతో పిలవకుండా "పెళ్లి కొడుకు" అని మాత్రమే పిలిచారని, ఇది తనకు ఆశ్చర్యం కలిగించిందని సరదాగా చెప్పారు. దర్శకులు రాఘవేంద్ర రావు గారు కూడా "పెళ్లి కొడుకుని రమ్మనయ్యా" అని చెప్పారని, కృష్ణ గారు వచ్చేలోపు తన షాట్లు తీయడానికి ప్రయత్నించారని వివరించారు. ఫ్రేమ్‌లోకి తను వచ్చినప్పుడు, "నువ్వేంట్రా?" అని కృష్ణ గారు అనగా, "వేషం వేషం అని నేను ఎప్పటినుంచో అడుగుతున్నాను" అని చెప్పానని అన్నారు.అప్పుడు కృష్ణ గారు గోపాల్ గారిని పిలిచి, పరుచూరి బ్రదర్స్ ను పిలిపించి, మంచి డైలాగ్స్ రాయించి, తనను సినిమాలో కొనసాగించారని సాయి కుమార్ ఆ సంఘటనను గుర్తు చేసుకున్నారు. అగ్ని పర్వతం ఒక సూపర్ హిట్ సినిమా అని తెలిపారు. తాను ముప్పలనేని శివ దర్శకత్వంలో కూడా ఒక సినిమాలో నటించానని, అలాగే ప్రముఖ నటి, దర్శకురాలు విజయనిర్మల గారి దగ్గర కూడా మంచి సినిమాలు చేశానని, ఆమె దర్శకత్వంలో పిన్ని వంటి కొన్ని మంచి చిత్రాలలో నటించానని సాయి కుమార్ పేర్కొన్నారు. శోభన్ బాబు గారితో కూడా తన సినీ ప్రస్థానంలో అనేక చిత్రాలలో నటించానని, ముఖ్యంగా పరువు ప్రతిష్ట, దోషి నిర్దోషి

## ఆ సినిమా ఫ్లాప్‌తో నా ఆలోచన పూర్తిగా మారిపోయింది



ఒక సినిమా ఫ్లాప్ అయినప్పుడు అది దర్శకుల ఆలోచనలను, సినిమా తీసే విధానాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. ప్రస్తుతం రామ్ గోపాల్ వర్మ ఓ ఇంట్రెస్టింగ్ సినిమా తెరకెక్కిస్తున్నాడు. ఇటీవలే ఆ సినిమాను అనౌన్స్ చేశారు ఆర్జీవీ. ఇక ఆర్జీవీ చేసే వ్యాఖ్యలు సంచలనంగా మారుతుంటాయి. కాగా గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆర్జీవీ మాట్లాడుతూ.. ముఖ్యంగా, ఒక ఫెయిల్యూర్ తర్వాత తన దృక్పథం ఎలా మారిపోయిందో ఆయన ఆసక్తికరంగా వివరించారు. సినిమా విజయం కేవలం స్టార్ కాంబినేషన్లపైనే ఆధారపడదనే వాస్తవాన్ని ఆయన వివరించారు.ఈ ఇంటర్వ్యూలో ఆర్జీవీ ఒక ఆసక్తికరమైన ఉదాహరణను ప్రస్తావించారు. "బాహుబలి" సినిమా నిర్మాణ సమయంలో శివగామి పాత్ర కోసం మొదట శ్రీదేవికి ఆఫర్ వచ్చిందని దర్శకుడు రాజమౌళి వెల్లడించారు. అయితే, ఒక పెద్ద స్టార్ ను తీసుకురావడం వలన అయ్యే ఖర్చులు, ఇతర అంశాల కారణంగా శ్రీదేవిని కాకుండా రమ్యకృష్ణను ఎంచుకోవలసి వచ్చిందని రాజమౌళి పేర్కొన్నారు. చివరకు, రమ్యకృష్ణ ఆ పాత్రకు ప్రాణం పోసి, ఆ పాత్ర కోసమే ఆమె పుట్టారన్నంత అద్భుతంగా నటించారని ఆర్జీవీ గుర్తుచేశారు.సరైన పాత్రకు సరైన నటుడిని ఎంచుకోవడం చాలా ముఖ్యమని వివరించారు. ఒక సినిమా ఫ్లాప్ తర్వాత తాను నేర్చుకున్న ముఖ్యమైన పాఠాలలో ఇది ఒకటని ఆయన చెప్పుకొచ్చారు. ఇది దర్శకులు, నిర్మాతలు తమ నిర్ణయాలను మరింత వివేకంతో తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుంది. ఆర్జీవీ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ఆ హీరోలాగా ఉండడం ఎవరి వల్ల కాదు



హీరో శ్రీకాంత్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో సూపర్ స్టార్ కృష్ణగారి విశిష్ట స్థానాన్ని, అలాగే సినిమా నిర్మాణంలో దర్శకుడి ప్రాముఖ్యతను వెల్లడించారు. శ్రీకాంత్ కృష్ణగారి నిజాయితీని, ధైర్యాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. ఒక సినిమా విజయవంతం కాలేదని తెలిసినప్పుడు, కృష్ణగారు ఏమాత్రం సంకోచించకుండా నా సినిమా ఫ్లాప్ అయ్యింది అని స్వయంగా చెప్పేవారని గుర్తుచేసుకున్నారు. అటువంటి అరుదైన ఫ్రాంక్‌నెస్, నిజాయితీ మరెవరిలోనూ కనిపించవని శ్రీకాంత్ అన్నారు. కృష్ణగారి డేరింగ్ అండ్ డాషింగ్ స్వభావాన్ని, ఆయన చేసిన సాహసాలను, ప్రయోగాలను శ్రీకాంత్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎక్స్పెరిమెంటల్ చిత్రాలను నిర్మించడంలో, కొత్త టెక్నాలజీని పరిచయం చేయడంలో కృష్ణగారు ఎల్లప్పుడూ ముందుండేవారని, వాటి ఫలితాలు ఎలా ఉన్నా, ఆయన వాటి గురించి క్షణం కూడా ఆలోచించకుండా ముందుకు సాగేవారని తెలిపారు. సాధారణంగా సినిమా ఫ్లాప్ అయితే, కొందరు రచయితలనో, దర్శకులనో నిందించడం చేస్తుంటారని, కానీ కృష్ణగారు అటువంటి వారికి పూర్తి భిన్నమని శ్రీకాంత్ అన్నారు.తన సినీ ప్రయాణంలో, శ్రీకాంత్ దర్శకుడి పాత్రకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. దర్శకుడిని కెప్టెన్ ఆఫ్ ది షిప్గా అభివర్ణించారు. ఒక సినిమా విజయం లేదా అపజయం పూర్తిగా దర్శకుడి చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. నటీనటులు కేవలం కథ విని, తమ పాత్రను పోషించి వెళ్ళిపోతారని, కానీ సినిమాకు ప్రాణం పోసేది, దానిని ఒక కళాఖండంగా మలిచేది దర్శకుడేనని శ్రీకాంత్ వివరించారు. కెమెరా డిపార్ట్‌మెంట్ నుండి మ్యూజిక్, డైలాగుల వరకు, ప్రతి షాట్‌లో అందం, విజువల్స్, ఎక్స్ప్రెషన్స్, ఎమోషన్స్‌ను పర్యవేక్షించేది దర్శకుడేనని ఆయన చెప్పారు. ఇరవై నాలుగు క్రాఫ్ట్స్‌ను సమన్వయం చేసే బాధ్యత దర్శకుడిదేనని, ఈ విషయంలో హీరోలు లేదా ఇతర సాంకేతిక నిపుణుల పాత్ర పరిమితమని ఆయన అన్నారు.